సాక్షి సంగారెడ్డి

మంగళవారం ; 2 ; మే ; 2023



పంచవటి క్షేత్రం.. భక్త జనసంద్రం

న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్–హుమ్నాపూర్ పంచవటి క్షేత్రం సోమవారం భక్త జనసంద్రమైంది. కుంభమేళాకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. 8లో



ఉద్యోగం ఆశచూపి మోసం

జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన మెసేజ్‌కి స్పందించిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సుమారు రూ.25లక్షల సొమ్మును పోగొట్టుకున్నారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన

సంగారెడ్డి టౌన్: జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 3న బుధవారం టీఎన్జీ భవనంలో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. అసంఘటిత సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ రంగ నాణ్యత ప్రమాణాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం ప్రవేశపెట్టాయన్నారు. పట్టణంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అందిస్తున్న తోడ్పాటు, సబ్సిడీ, రుణసదుపాయం తదితర వివరాలపై ఔత్సాహికులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రదర్శనను స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎఫ్‌పీఓలు, కోఆపరేటివ్ సొసైటీలు, ఆసక్తి కలిగిన వారు, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్‌ఓ వనజాత, అధికారులు

సంగారెడ్డి టౌన్: యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్/సహాయ కేంద్రాన్ని సోమవారం డీఎస్ఓ వనజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిధాన్యం సేకరణలో సమస్యలుంటే 08455 272233కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, ఉప పౌరసఫరాల అధికారి నిత్యానందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం పదో తరగతికి సైన్స్, టెక్నాలజీ, ఇంటర్మీడియట్‌లో కామర్స్, బిజినెస్ స్టడీస్ పరీక్షలు జరిగాయి. పదో తరగతి పరీక్షకు 1,788 మంది హాజరవగా, 206 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 1,786 మంది హాజరవగా, 185 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఇంటర్మీడియట్ సోషియాలజీ పరీక్షకు ఒక విద్యార్థికి గానూ ఆ ఒక్క విద్యార్థి గైర్హాజరు అయ్యాడు. పదో తరగతి హోమ్ సైన్స్ పరీక్షకు 51 మందికి గానూ 44 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను ఇన్‌చార్జ్ డీఈఓ విజయ సందర్శించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

సంగారెడ్డి మున్సిపాలిటీ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంపై ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి పట్టణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళింగ కృష్ణకుమార్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్‌తో ఉద్యోగ భరోసా వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఐటీ మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముద్దం సిద్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ. కోశాధికారి శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రెటరీ ఉదయ్, విట్టల్, అబ్బన్న, నరసింహారెడ్డి, రాజేశ్వర్, వెంకన్న, మధుచంద్ర, మహిళా అధ్యాపకులు శ్వేత, శిరీష, అనిత తదితరులు పాల్గొన్నారు.

వర్షం మాటున వ్యర్థం

- కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు
- గరళంగా మారుతున్న కుంటలు, చెరువులు



గడ్డపోతారంలో కాలుష్య జలాలను వదిలిన దృశ్యం



ఖాజీపల్లిలో కాల్వలో కాలుష్య జలాలు

జిన్నారం(పటాన్‌చెరు): స్వచ్ఛమైన నీటితో కళకళలాడే చెరువులు కుంటలు పరిశ్రమ కాలుష్య జలాలతో కలుషితం అవుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు కొన్ని పరిశ్రమ యాజమాన్యాలకు మారుతున్నాయి. పరిశ్రమల వ్యర్థ జలాలను వర్షపు నీటితో కలిసి బయటకు వదులుతుండడంతో అవి నేరుగా కాల్వల ద్వారా చెరువులకు చేరుతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సిన పీసీబీ అధికారులు పట్టించుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారీతిన కాలుష్య జలాలను బయటకు వదులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

పారిశ్రామిక వాడల్లో..

- జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో గడ్డపోతారం, బొల్లారం, ఖాజీపల్లి, బొంతపల్లి, దోమడుగు పారిశ్రామిక వాడల్లో రసాయన పరిశ్రమలు ఉన్నాయి.
- పరిశ్రమలో వెలువడిన కాలుష్య జలాలను నిబంధనలకు విరుద్ధంగా వరద నీటిలోకి వదులుతున్నారు.
- గడ్డపోతారం పారిశ్రామిక వాడలో ఓ గుంతలో పది ట్యాంకర్ల కాలుష్య జలాలను గుర్తుతెలియని వ్యక్తులు పారబోశారు.
- ఖాజీపల్లిలో ఎక్కడ చూసినా కాలుష్య జలాల ఘాటు వాసనలు వస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు.
- ఖాజీచెరువులో భారీగా వ్యర్థజలాలు చేరడంతో సమీపంలో కుంటలు, చెరువులు రంగుమారాయి.
- విషయాన్ని పీసీబీ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- గడ్డపోతారంలోని అయ్యమ్మ చెరువు వ్యర్థజలాలు చేరడంతో పచ్చగా మారింది.
- పరిశ్రమల యాజమాన్యాలకు పీసీబీ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఖాజీపల్లి జిల్లెల వాగు ఆక్రమణకు గురికావటంతో కాలుష్య జలాలు రోడ్లపైకి వస్తున్నాయి.
- వర్షాన్ని అదును చేసుకొని ట్యాంకర్ల ద్వారా వ్యర్థాలను పారబోస్తున్నారు.
- కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలుతీసుకొని, చెరువులు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెట్టాం

వర్షపు నీటితో కాలుష్య జలాలను వదిలితే చర్యలు తప్పవు. పారిశ్రామిక వాడలోని కొన్ని పరిశ్రమలపై నిఘా పెట్టాం. ప్రజల నుంచి వస్తున్న వినతులు స్వీకరిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– కుమార్, పీసీబీ ఏఈ

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పని చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు, ఐకేపీ సీసీలు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 209 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, డిమండ్‌ను బట్టి అవసరం ఉన్న చోట మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారికి సూచించారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలను సమకూర్చుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అవసరం మేర వాహనాలు, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ధాన్యం వివరాలనుఎ ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, ఎప్పటికప్పుడు ట్రక్ షీట్ సిద్ధం చేయాలని కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ధాన్యం చ్చిన 6గంటల్లోపు మిల్లర్లు అన్‌లోడ్ చేసి, ఎంట్రీ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఎస్ఓ వనజాత, డీసీఓ ప్రసాద్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, మార్కెటింగ్ అధికారి, సివిల్ సప్లై డీఎం సుగుణ, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, ఏఓలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మిల్లర్లు, ప్యాక్స్ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యులు

ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ ఎం.రమణ కుమార్ అన్నారు. సోమవారం పోలీస్ కల్యాణ మండపంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ అందించారు. కార్డియోపల్మనరీ రెసిస్టేషన్, ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ వచ్చినప్పుడు, యాక్సిడెంట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో వివరించారు. ఈ సందర్భంగా డా.రోహిత్, మనుజ మాట్లాడుతూ ఎవరికైనా హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు మొదట ప్రథమ చికిత్స వ్యక్తి భుజం తట్టి గట్టిగా పిలవాలన్నారు. హార్ట్ బీట్‌ను పరిశీలించి వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించాలి. అనంతరం ఆ వ్యక్తిని సమతల నేలపై పడుకోబెట్టి ఛాతిపై అరచేతులతో నొక్కుతూ నోటి ద్వారా కృత్రిమ శ్వాస అందించాలన్నారు. ఇలా రెండు మూడు సార్లు చేయడం వలన రక్త ప్రసరణ జరిగి బతికే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డీఎస్పీ బాలాజీ మాట్లాడుతూ ఎవరైనా హార్ట్ ఎటాక్, కరెంటు షాక్‌కు గురైనప్పుడు అత్యవసర సమయంలో సీపీఆర్ ప్రథమ చికిత్సతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ జనార్దన్, డీసీఆర్‌బీ సీఐ రమేష్, ఆర్‌ఐలు కృష్ణ, డానియెల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 16 దరఖాస్తులు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: ఆయా సమస్యలపై అర్జీదారులు ప్రజావాణిలో అందించిన దరఖాస్తులకు త్వరగా పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 16 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలకు సంబంధించి 6, ఇతర శాఖలకు సంబంధించి 10 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

సదాశివపేట మండలం సిద్ధాపురం గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. దహన సంస్కారాలకు ఇబ్బంది కలుగుతుందని, అధికారులు చొరవచూపి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

సాయం అందించండి

సదాశివనగర్‌కు చెందిన డప్పు మల్లమ్మ వర్షాలకు ఇల్లు కూలిపోయిందని, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి సాయం అందించాలని ప్రజావాణిలో అర్జీ అందించింది.

నేటి నుంచి రుణమేళా

సంగారెడ్డి టౌన్: పట్టణ ప్రగతి పీఎం స్వానిధి వీధి వ్యాపారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్–జోగిపేట, నారాయణఖేడ్, తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారంలో నేటి నుంచి ఈ నెల 31వ వరకు వీధి వ్యాపారులకు రుణమేళా నిర్వహించనున్నట్లు మెప్మా జిల్లా పథక సంచాలకులు గీతా తెలిపారు. మొదటి, రెండవ, మూడవ దఫాల్లో దరఖాస్తు చేసుకొని రుణం మంజూరుకాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రుణాలు పొందిన వీధి వ్యాపారులు డిజిటల్ వారి లావాదేవీలు చేస్తే నగదు ప్రోత్సాహకం కింద నెలకు రూ.150 పొందే అవకాశం ఉందని తెలిపారు.

13 మంది విద్యార్థినుల డిశ్చార్జీ

మునిపల్లి(అందోల్): సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 13 మంది విద్యార్థినులు డిశ్చార్జీ అయినట్లు బుదేరా మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరిఫా సోమవారం తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఫుడ్ పాయిజన్‌తో 14 మంది విద్యార్థినులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. కాగా ఒక విద్యార్థిని ఇంకా చికిత్స తీసుకుంటుందని, మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ అవుతుందని అరిఫా తెలిపారు.

ఓటర్ జాబితా పక్కాగా ఉండాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, పక్కన అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: ఓటర్ జాబితాలో పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తొలగించిన ఓటర్ వివరాలు, పొలిటికల్ పార్టీల సమావేశాల నిర్వహణపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరో మారు పరిశీలించాలన్నారు. చనిపోయిన కేసులో మినహా, షిఫ్టెడ్ కేటగిరి, రిపీటెడ్ నేమ్స్ తదితరాలలో నోటీసు ఇచ్చి విచారణ చేయాలన్నారు. అనెక్చర్ 1, 2, 3, 4, 5లను ప్రత్యేకంగా పరిశీలించి ఈనెల 6లోగా ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ సంతకాలతో నివేదికలను అందించాలన్నారు. టర్ టర్న్ అవుట్ తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, స్వీప్ యాక్టివిటీస్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. బీఎల్‌ఓలకు శిక్షణ అందించాలని, బీఎల్‌ఓ యాప్‌పై ఓరియంటేషన్ నిర్వహించాలన్నారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ప్రతీవారం పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఆరు కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలను ఫిజికల్‌గా పరిశీలించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. మేడే పురస్కరించుకొని సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, వాజిద్ అలీతో కలిసి పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఐఎన్‌టీయూసీ కీలక పాత్ర పోషిస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మేడే సందర్భంగా పలు పరిశ్రమల వద్ద ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరించారు. కార్మికుల హక్కులకై ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిరుడు సాయిలు, బోయిని ప్రసాద్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకట రాజ్యం,శివ శంకర్, లక్ష్మి,మాధవి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'సాక్షి' సమ్మర్ క్యాంప్

- తొలిరోజు విశేష స్పందన
- హాజరైన పట్టణ ప్రముఖులు



మాట్లాడుతున్న పూసల లింగాగౌడ్



శిబిరంలో చిన్నారులకు నైపుణ్యాలను నేర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రావ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యార్థులు పాఠాలతో పాటు కొత్త అంశాలు నేర్చుకునేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం జిల్లా అధ్యక్షుడు పూసల లింగాగౌడ్ అన్నారు. సాక్షి మీడియా గ్రూప్, సినాప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం సమ్మర్ క్యాంపు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా లింగాగౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 'సాక్షి' పెద్ద ప్రభంజనం సృష్టించిందని, పాఠశాలల యాజమాన్యాలను సమన్వయం చేస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని కొనియాడారు. తాము చదువుకునే రోజుల్లో ఇలాంటివి కార్యక్రమాలు ఉండేవి కాదని అన్నారు. వేసవి శిబిరాల్లో మేథో శక్తి పెంచేందుకు అవసరమైన ఆటలు, గేమ్స్‌ను పిల్లలు నేర్చుకుంటాని అన్నారు. సినాప్స్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తొలిరోజు శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆటా, పాటల ద్వారా వివిధ నైపుణ్యాలలో శిక్షణ అందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్కూల్ అధ్యాపక బృందం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సినాప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్, ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ రాజు గౌడ్, సాయిరాం సహస్ర మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావ్య, రోటరీ క్లబ్ సభ్యుడు షాబాద్ శ్రీనివాస్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రెటరీ చందర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సాక్షి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోజనం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. స్కూల్ యాజమాన్యాలు సైతం పాల్గొనడం అభినందనీయం. క్యాంపులో కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ రాజు గౌడ్, ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్

స్కిల్స్ పెంచుకుంటా..



వేసవి క్యాంపు రావడం సంతోషంగా ఉంది. నాకు డ్రాయింగ్ అంటే ఇష్టం. ఇక్కడ అన్ని రకాల నైపుణ్యాలపై ట్రైనింగ్ ఇస్తున్నారు. వారం రోజుల శిక్షణకు హాజరై స్కిల్స్ పెంచుకుంటా.

– భవాని, విద్యార్థిని

ప్రాక్టికల్ ట్రైనింగ్



సమ్మర్ క్యాంపులో అన్ని రకాల వైవిధ్యాలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తాం. శిక్షణ అనంతరం ప్రతిభ చూపిన వారికి అవార్డులను కూడా అందిస్తాం. ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలి.

– శ్రావ్య, పాఠశాల ప్రిన్సిపాల్



పట్టణ శివారులో నేలకొరిగిన జొన్న పంట



నిజాంపేట్ మండలం కొత్తపల్లిలో నేలవాలిన వరి

నేలవాలిన పంటలు

అకాల వర్షాలతో నారాయణఖేడ్ ప్రాంతంలో పంటలకు అపారనష్టం వాటిల్లింది. నాలుగు రోజులుగా ఈదురు గాలులు, వడగండ్లు పడుతుండడంతో పంటలు నేలవాలుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాలకు నిజాంపేట్ మండలం కొత్తపల్లిలో జొన్న, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

– నారాయణఖేడ్

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై ఆరు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 మంది వాహనదారులు మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.24వేల జరిమానా విధించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులో పేకాట ఆడుతున్న పలువురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.6,990ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యు.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హెడ్‌కానిస్టేబుల్ నరేందర్, కానిస్టేబుళ్లు గోవర్ధన్‌రెడ్డి, కరుణాకర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులకు పేకాట ఆడుతున్న శ్రీనివాస్, నర్సింహులు పట్టుబడగా కొండయ్య, అశోక్, శ్రీను, విక్రమ్ అనే నలుగురు పారిపోయినట్లు తెలిపారు. పట్టుబడ్డ వారి నుంచి రూ.6,990 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రేక్ ఫెయిల్..
బస్సును ఢీ కొట్టిన సుమో

నర్సాపూర్: సుమో బ్రేకులు ఫెయిల్ అవడంతో బస్సును వెనక నుంచి ఢీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి..మెదక్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి మెదక్ వెలుతూ నర్సాపూర్ బస్టాండు సమీపంలోకి రాగానే వెనక నుంచి బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనక భాగం స్వల్పంగా దెబ్బతింది. కాగా సుమో డ్రైవర్ కాశినాథ్ మాట్లాడుతూ తన వాహనం బ్రేకులు ఫెయిల్ అవడంతో ప్రమాదం జరిగిందని చెప్పాడు. బస్సు స్వల్పంగా దెబ్బ తినడంతో ఇరువురు రాజీ పడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మేస్త్రీ ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కడుపునొప్పి భరించలేక ఓ మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన సురేందర్ (31) జీవనోపాధికోసం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ సైబర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల ఆ నొప్పి ఎక్కువ కావడంతో ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

పంచవటి క్షేత్రం.. భక్త జనసంద్రం

కుంభమేళాకు తరలివచ్చిన భక్తులు | కిటకిటలాడిన మంజీర పరిసరాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రాఘవాపూర్-హుమ్నాపూర్ శివారు పంచవటి క్షేత్రం సోమవారం భక్త జనసంద్రమైంది. కుంభమేళాకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు క్షేత్రం నుంచి మంజీర నది వరకు వరుస కట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు కుంభమేళాకు తరలి వచ్చారు. గంగామాతకు పూజలు నిర్వహించి దైవదర్శం చేసుకున్నారు. 8వ రోజు ఆలయ ఆవరణలో యజ్ఞాలు, హోమాలు కొనసాగాయి. పంచవటి క్షేత్రంలో శారదాదేవి, సాయిబాబ, వెంకటేశ్వర, శనీశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. నది వద్ద వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య గంగాదేవికి పూజలు చేసి, హారతి నిర్వహించి, ఆలయంలో అమ్మవారికి, శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పంచవటి క్షేత్రం ఆవరణలో రత్నాపూర్ భవానీ భజన మండలి అధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.


నది వద్ద భక్తుల కిటకిట


దైవ దర్శనానికి బారులు తీరిన జనం


గంగాదేవి ఆలయంలో భక్తుల సందడి

ఉద్యోగం ఆశచూపి సైబర్ మోసం

- టెలిగ్రామ్ ద్వారా అపరిచిత వ్యక్తి నుంచి మెసేజ్
- రెట్టింపు నగదు పేరిట వల
- ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి రూ.25లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ ఉందంటూ.. అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన మెసేజ్‌కి స్పందించిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సుమారు రూ.25లక్షల సొమ్మును పోగొట్టుకున్నారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగం ఉందంటూ.. అమీన్‌పూర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఏప్రిల్ 21న టెలిగ్రామ్ ద్వారా ఓ మెసెజ్ వచ్చింది. లింక్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన ప్రకారం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసింది. ఇలా 42 దఫాల్లో ఇన్వెస్ట్ చేసి తను గెలిచిన నగదును ఇవ్వాలంటూ కోరగా, మెసెజ్‌కి స్పందన రాలేదు. చివరికి రూ.20,63,375లు మోసపోయానని గుర్తించి వెంటనే సైబర్ క్రైం ఫిర్యాదు చేసింది.

మరోఘటనలో..

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఏప్రిల్ 23న టెలిగ్రామ్ ద్వారా వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసింది. పలు దఫాలుగా రూ.4,60,000లను పంపించింది. చివరకు మోసపోయినట్లుగా గుర్తించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి అస్థిపంజరం లభ్యం

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన వ్యక్తి అస్థిపంజరం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్(36) జనవరి 2వ తేదీన భార్య సంతోషతో గొడవపడ్డాడు. రోజుమాదిరిగా 3వ తేదీన భార్య గీతం విశ్వవిద్యాలయంలో పనిచేసేందుకు వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చేసరికి భర్త శ్రీనివాస్ ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆమె అత్త అనంతమ్మను అడగ్గా మధ్యాహ్నం నుంచి ఇంట్లో లేడని చెప్పింది. భర్త కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య రెండు రోజుల తర్వాత పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యమైన వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో రుద్రారం శివారులో ఆదివారం సాయంత్రం చిన్నకాలువలో స్థానికులు ఒక అస్థిపంజరాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుని చొక్కా జేబులో పర్సులోని పాన్ కార్డు చూసి శ్రీనివాస్‌గా గుర్తించారు. ఈ మేరకు అస్థిపంజరం యొక్క డీఎన్ఏను పరీక్షలకు పంపుతున్నట్లు వారు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాస్ (ఫైల్)

తండ్రి మందలించాడని..

కూతురు ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడొద్దని తండ్రి మందలించడంతో కూతురు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సునీతా లక్ష్మారెడ్డి కాలనీకి చెందిన మహ్మద్ షాబోద్దీన్ కూతురు జుబేరియా అంజుమ్(15) తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆదివారం రాత్రి సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడొద్దని తండ్రి మందలించాడు. దీంతో బాలిక సోమవారం వేకువజామున బెడ్రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గత కొన్ని రోజులుగా చదువు..ఇంటి పనులను పక్కన పెట్టి తరచూ ఫోన్‌లో గేమ్స్ ఆడుతండగా.. తండ్రి ఫోన్ గుంజుకుని మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


జుబేరియా అంజుమ్ మృతదేహం

పశువుల చోరీ.. రైతుల ఆందోళన

నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతుల వేడుకోలు

శివ్వంపేట(నర్సాపూర్): గూడూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి పాడిగేదెలు చోరీ సంఘటనపై రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన బోయిని ఐలయ్య పాడిగేదెలను అదేగ్రామానికి చెందిన ఓ వ్యాపారి చోరీ చేసి ఆటోలో జహీరాబాద్‌లోని పశువధశాలకు తరలిస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. గూడూర్‌తో పాటు సమీప ప్రాంతాల్లోని పలువురి రైతులకు సంబంధించిన పశువులు గతంలో చోరీకి గురైనట్టు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారనే విషయం తెలుసుకున్న బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. పశువులకు సంబంధించి రికవరీ చేసి తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ 40 పశువులు చోరీకి గురైనట్లు రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ తెలిపారు. పశువుల వ్యాపారి అజీజ్, కోలా రాజులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి చికిత్స కోసం అంబులెన్సులో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిస్తే మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు..

చిన్నశంకరంపేట(మెదక్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం అంబాజిపేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన డప్పు చిన్న నర్సింహులు(35) ఆదివారం అంబాజిపేటలోని బంధువు బండారి వెంకట్ ఇంట్లో పంక్షన్‌కు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. ఈ క్రమంలో అంబాజిపేట గ్రామ శివారులోని రోడ్డుపక్కన బావి సమీపంలో నర్సింహులు బైక్ పార్క్ చేసి కనిపించింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా బావిలో మృతదేహం కనిపించింది. మృతుని భార్య శోభ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థి అదృశ్యం

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని విఠునాయక్ తండాకు చెందిన విద్యార్థి కేతావత్ కరణ్‌కుమార్(19) అదృశ్యమైనట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..అల్వాల్‌లోని విజ్ఞాన్ భారతి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నా కరణ్‌కుమార్ బంధువుల పెళ్లికని స్వగ్రామానికి వచ్చాడు. ఏప్రిల్ 29వ తేదీన రాత్రి 10గంటల సమయంలో జహీరాబాద్‌లో పని ఉందని, తండా నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కాశీనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నెంబర్‌కు 8712656766 సమాచారం అందించాలని కోరారు.


కరణ్‌కుమార్(ఫైల్)

పోక్సో కేసులో
వ్యక్తికి 25ఏళ్ల జైలు

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసులో ఓ వ్యక్తికి 25 ఏళ్ల జైలు, రూ.50వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లక్ష్మీశారద సోమవారం తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్‌పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022, జూన్ 5న మిస్సింగ్ కేసు సోమవారం మెదక్‌జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసును పూర్తి స్థాయిలో పరిశీలించిన న్యాయమూర్తి లక్ష్మీశారద నిందితుడు డాకూరి నర్సింలును 25యేళ్ల జైలు, రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

కిడ్నాప్ అయిన చిన్నారి క్షేమంగా ఇంటికి

దుబ్బాక: కిడ్నాప్‌కు గురైనా నాలుగేళ్ల చిన్నారి శైలజ క్షేమంగా తల్లి ఒడి చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. కిడ్నాప్‌కు గురైనా..శైలజను 10 గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించారు. ఆదివారం తాతతో వెళ్లిన శైలజ పాప కనబడడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాప కిడ్నాప్ అయినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు ఈ కిడ్నాప్‌ను చాలేంజ్‌గా తీసుకున్నారు. 3, 4 బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాప్ చేసిన మహిళతో పాటు మరో వ్యక్తి ఆదివారం దౌల్తాబాద్ నుంచి గజ్వేల్, గజ్వేల్ నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తున్నట్లు గుర్తించారు. పాప మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్నట్లు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పోలీసులు గుర్తించారు. పాపను అక్కడి నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో కిడ్నాప్‌కు గురైనా బాలిక కేసు కొలిక్కి రావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.


తల్లితో చిన్నారి శైలజ

నిజాయితీ చాటుకున్న యువకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం పంచగామకు చెందిన కృష్ణ, అమేర్‌లకు పట్టణంలో సోమవారం ఒక చోట మొబైల్‌ఫోన్, ఏటీఎం కార్డులు దొరికాయి. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి తమ నిజాయితీ చాటుకున్నారు. మొబైల్ ఫోన్‌లో ఉన్న నెంబర్ల ఆధారంగా బాధితుని వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో పోలీ సులు రాజురాథోడ్‌గా గుర్తించి అతడికి సమాచారం అందజేశారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయన పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్, ఏటీఎం కార్డును కృష్ణ, అమేర్ అందజేశారు. దీంతో వారి నిజాయితీని పోలీసులతోపాటు బాధితుడు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

తేనెటీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

దుబ్బాక: తేనెటీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మాస్టి సులోచన సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. పొలం పనులు చేస్తున్న క్రమంలో మధ్యాహ్నం తేనెటీగలు ఆమెపై ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది. అక్కడున్న స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ అశోక్, పైలట్ జనార్ధన్‌లు ఆమెకు ప్రాథమిక చికిత్సనంతరం ఆమెను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

పటాన్‌చెరు టౌన్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్‌తో గుర్తించి బాధితురాలికి డీఎస్పీ భీంరెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి అందజేశారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన రూప్సీ మార్చి 16వ తేదీన మంజీర కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు తన బ్యాగ్‌లో ఫోన్ పెట్టి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి బ్యాగులో పెట్టిన మొబైల్ ఫోన్ కనిపించలేదు. దీంతో విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్‌లో ఆమె వివరాలు నమోదు చేశారు. అనంతరం వచ్చిన సమాచారంతో ఫోన్ ఎక్కడుందో తెలుసుకొని రికవరీ చేసి సదరు విద్యార్థినికి అప్పగించారు.

ప్రైవేటు బస్సు ఢీ కొని వ్యక్తి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్కూటీని కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఎద్దు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..

దుబ్బాకరూరల్: ప్రైవేటు బస్సు టీవీఎస్‌ఎక్సెల్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని నగరం చౌరస్తా వద్ద సోమవారం జరిగింది. భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన దొంతర బోయిన రాజయ్య(47) భూంపల్లిలో పెద్దమ్మ పండగకు తన బంధువుల ఇంటికి టీవీఎస్‌ఎక్సెల్‌పై వెళ్లుతున్నాడు. ఇదేక్రమంలో సిద్దిపేట నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు టీవీఎస్ఎక్సెల్‌ను ఢీకొట్టింది. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చిలప్‌చెడ్‌లో ఎద్దు..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు ఢీకొని ఎద్దు మృతి చెందిన సంఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెద్దుల గూడెంకు చెందిన ఎల్లయ్య పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే పశువులను మేతకు తీసుకెళ్తున్న క్రమంలో సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెదక్ నుంచి సంగారెడ్డి వెళ్తూ చిట్కుల్ శివారులో ఎద్దును ఢీకొట్టింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. తనకు న్యాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



స్కూటీని ఢీ కొట్టిన కారు

ఇద్దిరికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): స్కూటీని కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి మెదక్ నుంచి చేగుంటకు వస్తున్న మాసుల కిషోర్, నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ ఆంజనేయులు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన పెద్ద శంకరంపేటకు చెందిన కారు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.


గాయపడ్డ శ్రీరామ్ ఆంజనేయులు

బైక్‌పై వెళ్తుండగా చెట్టుకొమ్మపడి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లి శివారులో బైక్‌పై వెళ్తున్న వారిపై ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం జంబికుంట గ్రామానికి చెందిన తాటిపొండ సంగారెడ్డి, తన మనవడు హిమవంత్‌రెడ్డిని నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో తన కూతురు వద్దకు దింపేందుకు బైక్‌పై బయలుదేరాడు. మల్లయ్యపల్లి శివారులో మర్రి చెట్టు కొమ్మ విరిగి పడడంతో సంగారెడ్డి చేయి విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో హిమవంత్‌రెడ్డి సైతం గాయపడ్డాడు. స్థానికులు 108లో వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంగారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

పిడుగుపడి పాడిపశువుల మృత్యువాత

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు గురై పశువులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోనెపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్రె ఎల్లయ్యకు చెందిన రెండు పాడి పశువులను తన పొలం వద్ద పాకలో కట్టేశాడు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పాక వద్ద పిడుగు పడటంతో అవి మృతి చెందాయి. సోమవారం ఉదయం ఎల్లయ్య పొలం వద్దకు వెళ్లగా పశువులు మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ.2 లక్షల వరకూ నష్టపోయినట్టు బాధిత రైతు ఎల్లయ్య బోరున విలపించాడు. బాధిత రైతును ఆదుకోవాలని సర్పంచ్ స్వరూప ఎల్లాగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

చంద్లాపూర్‌లో

మండల పరిధిలోని చంద్లాపూర్‌లో పిడుగుపడి పశువు మృతి చెందింది. రోజుమాదిరిగానే కనకయ్య తన పాడి పశువును పొలం వద్ద ఉంచాడు. పిడుగు పడి అది మృతి చెందింది. దీంతో ఆయనకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బోరున విలపించాడు.


దుబ్బాక: పాడి గేదె కళేబరం


గోనెపల్లిలో మృతి చెందిన పశువులు

కోహెడరూరల్(హుస్నాబాద్):మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. కొక్కుల రమ తన ఇంటి సమీపంలో ఆవును కట్టేసి వెళ్లింది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో ఆవు మృతి చెందింది. సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

దుబ్బాకలో గేదె

దుబ్బాక: పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన సంఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో జరిగింది. చుక్క కనకయ్య ఆదివారం రాత్రి తన పొలం వద్ద పాలు పిండి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా గేదె మృతి చెంది ఉందని కనకయ్య కన్నీటి పర్యాంతమయ్యాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

దుబ్బాక రూరల్‌లో పాడి గేదె..

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన రైతు మహేందర్‌కు చెందిన పాడిగేదె ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడి మృతి చెందింది. రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.